# సంక్షేమ పథకాలే ప్రభుత్వానికి అండ



తిర్మలాపూర్‌లో జీపీ, డ్వాక్రా భవన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ పోచారం

- పని చేసే నాయకులను ప్రజలు ఆదరించాలి
- అర్హులందరికీ పక్కా ఇండ్లు ఇస్తాం
- గృహలక్ష్మి పథకానికి రూ.12వేల కోట్లు కేటాయింపు
- 'డబుల్' ఇండ్ల మంజూరుకు ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు
- సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి
- వర్నిలో 1434మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి మంజూరు పత్రాల అందజేత
- తిర్మలాపూర్ గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభించిన స్పీకర్

బాన్సువాడ రూరల్/ వర్ని, అక్టోబర్ 7 : దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్నదని సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. సంక్షేమ పథకాలే సర్కారుకు అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. శనివారం ఆయన బాన్సువాడ మండలం తిర్మలాపూర్ గ్రామంలో రూ. 2.53 కోట్ల అభివృద్ధి పనులను ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. వర్ని మండల కేంద్రంలోని సీసీడీలో వర్ని, చందూర్, మోస్రా, రుద్రూరు, కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన 1434మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దూరదృష్టితో రూ.85వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని తెలిపారు. కాళేశ్వరం నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి తీసుకొచ్చి రెండు పంటలకు సాగు నీరు అందిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో సాగు నీటికి ఎలాంటి ఢోకాలేదన్నారు. పేదలకు విద్య, వైద్యం పూర్తిస్థాయిలో అందాలని బాన్సువాడ నియోజకవర్గంలో దవాఖానలు, గురుకుల పాఠశాలల ఏర్పాటుకు కృషి చేసినట్లు చెప్పారు. కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. తిర్మలాపూర్ గ్రామానికి పదేండ్లలో సంక్షే మ పథకాలకు రూ.16.37 కోట్లు, అభివృద్ధి పనులకు రూ.11.54 కోట్లు నిధులు ఖర్చు చేశామని వివరించారు. నిరుపేదలకు పక్కా ఇండ్లు నిర్మించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ గృహలక్ష్మి పథకం కోసం బడ్జెట్‌లో రూ.12వేల కోట్లు కేటాయించారని తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల మంజూరు కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వ వద్దని సూచించారు. సుపరిపాలన అందిస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్ రెడ్డి, సర్పంచ్ జిన్నరఘురామయ్య, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ దుద్దాల అంజిరెడ్డి, ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు దొడ్ల నీరజారెడ్డి, పద్మాదారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ భూషణ్‌రెడ్డి, బుడ్మి సొసైటీ చైర్మన్ గంగుల గంగారాం, ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి, బాన్సువాడ సొసైటీ అధ్యక్షుడు ఎర్వాల కృష్ణారెడ్డి, రైతుబంధు సమితి గ్రామ అధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు

## ప్రొసీడింగ్ కాపీలను అందజేసిన అర్బన్ ఎమ్మెల్యే బిగాల



నగరంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల

ఖలీల్‌వాడి, అక్టోబర్ 7 : జిల్లాకేంద్రంలోని వివిధ కులసంఘాల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం సీడీపీ నిధులను అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా మంజూరు చేశారు. ప్రొసీడింగ్ కాపీలను ఆయా కుల సంఘాల ప్రతినిధులకు ఆయన శనివారం అందజేశారు. కార్మిక భవనం మార్కెట్ యార్డుకు రూ.50 లక్షలు, మారుతీనగర్ కమ్యూనిటీ హాల్‌కు రూ.7.20 లక్షలు మంజూరు చేశారు. పాటిగల్లీ మున్నూరుకాపు సంఘానికి, ధర్మపురిహిల్స్‌లోని అంబేద్కర్ సంఘానికి, వినాయక్‌నగర్‌లోని గంగపుత్ర సంఘానికి రూ.5 లక్షలు, చింతచెట్టుమైసమ్మ సమితికి, పద్మశాలీ ఉద్యోగుల సంఘానికి, గురడిరెడ్డి సంఘానికి, నీలకంఠేశ్వర మాల సంఘానికి, పూసలసంఘానికి, పద్మశాలీ స్కూల్‌కు, మేతరి సంఘానికి, తెలంగాణ అంబేద్కర్ సంఘానికి, వినాయక్‌నగర్‌లోని ముదిరాజ్ సంఘానికి రూ. 5 లక్షల చొప్పున మంజూరు చేశారు. తానాగల్లీలోని వైశ్య ముదిరాజ్ సంఘానికి రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసిన ఆయా కుల సంఘాల సభ్యులు ఎమ్మెల్యే బిగాలకు కృతజ్ఞతలు తెలిపారు.

**అభివృద్ధి పనుల పరిశీలన**

నగరంలో కొనసాగుతున్న సమీకృత మార్కెట్, కళాభారతి నిర్మాణ పనులను అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా శనివారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట అధికారులు, కాంట్రాక్టర్లు ఉన్నారు.

# సేవాగుణాన్ని కలిగి ఉండడం వరం

## మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బీఎన్ రావు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 7 : మానవత్వంతో సేవ చేసే గుణాన్ని కలిగి ఉండడం గొప్ప వరమని మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బీఎన్‌రావు అన్నారు. జడ్పీ కార్యాలయంలో బీఎన్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 1.30 లక్షలతో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్లు ప్రజల ప్రాణాలను కాపాడడంతో పాటు సేవాగుణాన్ని కలిగి ఉండాలన్నారు. సేవ రాజకీయ నాయకులే కాకుండా మానవత్వం ఉన్న ప్రతిఒక్కరూ చేయవచ్చని అన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషిచేస్తున్నారన్నారు. జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ.. డాక్టర్‌గా బీఎన్‌రావు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. కొవిడ్ సమయంలో చాలా మందిని అప్రమత్తం చేసి, వివిధ సేవలు అందించారని కొనియాడారు. అనంతరం బీఎన్‌రావును జడ్పీచైర్మన్‌తో పాటు ఐఎంఏ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు నీలిరాంచందర్, డాక్టర్ విశాల్, డాక్టర్ కిరణ్ మాదాల, వినియోగదారుల సమాచార కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు మాయవార్ రాజేశ్వర్, బీఆర్‌ఎస్ నాయకులు బుచ్చన్న, గోపాల్‌రెడ్డి, అంజయ్య, నీలంరెడ్డి, శేఖర్ రాజ్, మనోహర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎన్ రావు

# బీఆర్‌ఎస్‌కే జై కొడుతున్న జనం

- అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై గులాబీ పార్టీలో చేరికలు
- ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్/ మాక్లూర్, అక్టోబర్ 7: రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు బీఆర్‌ఎస్‌కే జైకొడుతున్నారని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్‌నగర్ కాలనీకి చెందిన భవానీ గంగా పుత్ర సంఘం,పెర్కిట్ తర్ప పద్మశాలీ సంఘం, మామిడిపల్లి తర్ప పద్మశాలీ సంఘం, పెర్కిట్ నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు, జర్నలిస్టు కాలనీ మాల సంఘం ప్రతినిధులు, వెల్మల్ గ్రామానికి చెందిన మున్నూరుకాపు , యాదవ సంఘ సభ్యులు, దత్తాపూర్ బంజార సేవా సంఘ సభ్యులు, ఆర్మూర్ మేస్త్రి సంఘం, డొంకేశ్వర్‌లోని శ్రీలక్ష్మి మహిళా సంఘం, గద్వాల్ క్యాంప్ బీసీ సంఘం సభ్యులు, దేగాం మాదిగ సంఘ సభ్యులు జీవన్‌రెడ్డికి మద్దతుగా శనివారం ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానాల కాపీలను జీవన్‌రెడ్డికి అందజేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాక్లూర్ మండలంలోని అడవిమామిడిపల్లి, వడ్డెరకాలనీ, మామిడిపల్లి తండాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు కల్పిస్తామన్నారు. సీఎం కేసీఆర్ వద్ద సాన్నిహిత్యంతో నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకువస్తున్నట్లు చెప్పారు. రూ3వేల కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 62 వేల మందికి అర్హులైన పేదలకు ఆసరా పెన్షన్లు అందిస్తున్నామని అన్నారు. అంబేద్కర్ చౌరస్తా, జగజ్జీవన్ రామ్ చౌరస్తాను సుందరీకరించినట్లు తెలిపారు. సిద్ధుల గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. అభివృద్ధిని చూసి మూడో ససారి తనను ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో ఆలూర్ సర్పంచ్ కళ్లెం మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ నర్సారెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఖాందేశ్ శ్రీనివాస్, పండిత్ ప్రేమ్ పాల్గొన్నారు.

# స్వరాష్ట్రంలోనే గ్రామాల్లో అభివృద్ధి



మినీ స్టేడియాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షకీల్

- కుల వృత్తులకు జీవం పోసిన కేసీఆర్ ప్రభుత్వం
- బోధన్ ఎమ్మెల్యే షకీల్

ఎడపల్లి, అక్టోబర్ 7: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ హయాంలోనే ప్రతి గ్రామం అభివృద్ధి చెందినట్లు బోధన్ ఎమ్మెల్యే షకీల్ తెలిపారు. శనివారం ఆయన ఎడపల్లి మండల కేంద్రంలో పర్యటించారు. గ్రామంలో రూ. 10 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభోత్సవాలు చేశారు. రైల్వే గేట్ పక్కన రజక సంఘం, నయాబాదిలో ముదిరాజ్, గౌడ సంఘాల భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో షకీల్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం కుల వృత్తులకు మళ్లీ జీవం పోసిందని తెలిపారు. సీడీపీ, రూర్బన్, ఎస్‌డీఎఫ్, ఎంఎస్‌డీపీ నిధులు రూ.కోటితో మినీ స్టేడియం, రూ.కోటితో ఆడిటోరియం, కన్వెన్షన్ హాలు, రూ. 50 లక్షలతో చేపల విక్రయ కేంద్రం, మార్కెట్ ప్రాంతంలో రూ.25 లక్షలతో షెడ్డు, రూ. 40 లక్షలతో పశువైద్యశాల, రూ. 22 లక్షలతో ఆరోగ్య ఉపకేంద్రం, రూ.34 లక్షలతో గ్రంథాలయ భవనంతో పాటు రూ. 15 లక్షలతో అదనపు గది, రూ. 5లక్షలతో మహిళా భవనం నిర్మించినట్లు తెలిపారు. ఒక్కో కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం రూ. 5 లక్షలు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితా యాదవ్, ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఇమ్రాన్ ఖాన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీరామ్, విండో చైర్మన్ పోల మల్కారెడ్డి, సర్పంచ్ ఆకుల మాధవి, మంగళ్‌పాడ్ ,కుర్నాపల్లి, ఠాణాకలాన్, దుబ్బతండా సర్పంచులు హన్మాండ్లు, సావిత్రి, భాస్కర్ రెడ్డి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.